# టీ తోటల కార్మికుల దుస్థితి

**గత** కొన్ని సం॥లుగా అనేక కారణాలవలన పశ్చిమబెంగాల్ టీ తోటల కార్మికుల గురించి చర్చ జరుగుతూవుంది. ప్రతి సం॥రం అనేకమంది టీ తోటల కార్మికులు లేదా వారి కుటుంబ సభ్యులు ఆకలితో మరణిస్తున్నారు. పేదరికం, ఆకలి, అనారోగ్యం, మరణాలనేవి రోజువారీ విషయా లయ్యాయి. టీ తోటల మహిళా కార్మికులనేకమంది జీవించటం కోసం వ్యభిచరిస్తున్న ఉదంతాలు అనేకం పత్రికల్లో వెలువడుతున్నాయి. ప్రస్తుతం పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో అధికారంలోనున్న ప్రభుత్వం పత్రికలద్వారా వెల్లడయ్యే వార్తలనేగాక, యునిసెఫ్, ఇతర స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన సర్వే నివేదికలను కూడా కొట్టిపారేస్తోంది. ఆకలి మరణాలు, స్త్రీల వ్యభిచారం వార్తలేకావంటోంది. మరోవైపున మమతాబెనర్జీ ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చాక తెరాయి ప్రాంతంలో, దోర్స్, డార్జలింగ్ కొండల్లో పర్యాటకాన్ని, పర్యావరణ పర్యాటకాన్ని బాగా అభివృద్ధిచేశామని గొప్పగా చెప్పుకుంటోంది. అయితే ఆకలిచావులు, మహిళల దుస్థితి గురించిన వార్తలు పత్రికలలో వెలువడి నప్పుడు కోల్‌కతా, ఇతర ప్రాంతాలలో కొన్ని నిరసనాందోళనలు జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో టీ తోటల కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన సాగిస్తూనే, వారికి సాధ్యమైన పరిధిలో వారు సంఘటితం కావడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈ పరిస్థితిని అర్థంచేసుకోవటానికి ఐదు సం॥ల క్రితం తెరాయి–దోర్స్–డార్జలింగ్ హిల్స్ పరిధిలోని ప్రాంతీయ కార్మిక కమిషనర్ చేసిన సర్వేను పరిశీలిద్దాం. ఆ ప్రాంతంలోని మొత్తం 276 టీ తోటలకు గాను 273 టీ తోటలలో ఈ సర్వే నిర్వహించారు.

టీ తోటల్లో కనీస వేతనం చాలా తక్కువగా వుంది. దాదాపు టీతోటల కార్మికులంతా ఝార్ఖండ్ నుండి తీసుకువచ్చిన ఆదివాసులు కావటం దీని వెనకనున్న అసలైన కారణం. టీ తోటల యజమానుల సూపర్ లాభార్జనల ధనదాహానికి ఈ కార్మికులు నికృష్ట దోపిడీకి గురిచేయబడుతూ వస్తున్నారు. ఆ కాలంలో కార్మిక చట్టాలేవీ ఉనికిలోనే లేవు. కార్మిక చట్టాలనేవి అమలులోకి వచ్చిన తర్వాత, కనీస వేతన చట్టాలు అనేక రాష్ట్రాలలో అమలుచేస్తున్నారు. టీతోటల కార్మికులు – ప్రత్యేకించి పశ్చిమబెంగాల్ టీతోటల కార్మికులు దీనికి మినహాయింపు. ఇతర పరిశ్రమలలో ఇచ్చే వేతనంలో సగాన్ని ఇక్కడ కనీసవేతనంగా లెక్కవేస్తారు. ఇతర పరిశ్రమలలో కార్మికుడిని ఒక యూనిట్‌గా; అతని లేదా ఆమె భాగస్వామిని 0.8 యూనిట్‌గా; ఇద్దరు పిల్లలనూ ఒక్కొక్కరిని 0.6 యూనిట్‌గా – మొత్తంమీద మూడు యూనిట్లుగా లెక్కవేసి కార్మికుని కనీస వేతనాన్ని గణిస్తారు. ఆహారం, బట్టలు, విద్య, నివాసం మొదలైనవన్నీ ఈ 3 యూనిట్లకు కల్పించటానికి అయ్యే ఖర్చును వేతనంగా లెక్కవేస్తారు. టీతోటలలో ఇది 1.5 యూనిట్లుగా మాత్రమే పరిగణిస్తారు. దీనికి చెప్పే కారణం చాలా కుటిలమైనది. టీతోటలలో స్త్రీ, పురుషులిరువురూ శ్రమ చేస్తారు కనుక వేతనాలను సగానికి దిగకోస్తారు. ఈ అంశాన్ని సవాల్‌జేస్తే, టీతోటల యజమానులు దుర్మార్గంగా వాదన చేస్తారు. టీతోటల కార్మికులకు వుండటానికి నివాసం, తాగునీరు, ఉచిత విద్యుత్తు, పిల్లలకు ప్రాథమిక విద్య ఉచితంగా కల్పిస్తున్నామని వాదిస్తారు. ప్రాథమిక ఆరోగ్యానికి టీతోటల ప్రాంగణంలో ఒక వైద్యుడిని నియమిస్తున్నామంటారు. పైగా రేషన్, ఇంధనం యజమానులే సరఫరా చేస్తారని చెప్తున్నారు. నిరుపేద కార్మికుల బేరసారాలాడే స్థితి చాలా తక్కువ స్థాయిలో వుండటంతో, దీర్ఘకాల సమ్మెల తర్వాత ట్రేడ్ యూనియన్లు లొంగాల్సి వస్తోంది.

ఏమైనా, ఎన్నో వాదనలు, ఆందోళనల పిదప రోజుకు ఒక్కొక్కరి వేతనం 159 రూ॥గా నిర్ణయించారు. అయితే, యజమానులుపైన కల్పిస్తున్నామన్న సౌకర్యాలన్నీ, 75 గజాల బట్టలు అందజేయటంతో సహా–ఏవీ కల్పించటంలేదు; లేదా అరాకొరగా మాత్రమే కల్పిస్తున్నారు. పైన పేర్కొన్న సర్వే వివరాలు వారి దుస్థితిని స్పష్టంచేస్తున్నాయి. మమతా నాయకత్వంలో టిఎంసి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకొచ్చినాక 2013లో నిర్వహించిన ఆ సర్వేలో కొద్దిపాటి మార్పు కూడా చేయలేదు. అప్పటికి 34 సం॥లు రాష్ట్రంలో అధికారంలోనున్న వామపక్ష సంఘటన ప్రభుత్వ కాలంలో పరిస్థితులు క్రమంగా దిగజారుతూ రాగా, మమతా బెనర్జీ ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి దారుణంగా పరిణమించింది.

సర్వేలో పేర్కొన్న ముఖ్యాంశాలు ఇలా వున్నాయి :

1. 273 టీతోటల్లోని 2,50,000 మందిపైగా కార్మికులలో (ఖచ్చితంగా కార్మికుల సంఖ్యను తగ్గించి చూపుతారు) 96,000 మందికి ఎలాంటి నివాసయోగ్య ఏర్పాటు కల్పించలేదు.
2. కార్మికులు నివసించే 20శాతం క్వార్టర్స్‌లో విద్యుత్తు సౌకర్యమే లేదు.
3. 20 శాతం కంటే తక్కువ టీ తోటలలో మాత్రమే మంచినీటి సౌకర్యం వుంది.
4. సక్రమంగా రేషను అందించని కారణంగా ఆకలితో మరణాలు సంభవిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఆహార భద్రతా పథకాన్ని ప్రారంభించిన తర్వాత, టీతోటల యాజమాన్యం అందించే కొద్దిపాటి రేషన్‌ను కూడా అందించకుండా నిలిపివేశారు.

5. 40 శాతంకంటే తక్కువ టీతోటలలో మాత్రమే కనీసపాటి వైద్యసౌకర్యానికి అవకాశం వుంది.
6. అనేక టీ తోటల పరిధిలో ఎలాంటి పాఠశాలలూ లేవు.
7. అధిక టీతోటలు తమ కార్మికులకు భవిష్య నిధిని చెల్లించటంలేదు.

ఈ సర్వే జరిగి 5 సం॥లు అయింది. ఈనాటికీ రాష్ట్రప్రభుత్వం టీతోటల యజమానులను ఒప్పించి చట్టబద్ధ కనీస సౌకర్యాలు టీ తోటల కార్మికులకు కల్పించేందుకు ఏ ఒక్క చర్యా తీసుకోలేదు. పైగా టీతోటల యజమానులతో చేతులు కలిపి, టీ తోటల సంక్షోభం నుండి బయటపడే పేరున టీతోటలకోసం రాష్ట్రప్రభుత్వం కేటాయించిన నిధులను తరలించివేస్తోంది. టీతోటల్లో మొక్కలు వాటి జీవిత కాలపరిమితి దాటిపోయాయి. 40 సం॥పైబడిన టీ పొదలే అక్కడున్నవన్నీ. యజమానులు కొత్తగా టీ తోటలు నాటటానికి ప్రయత్నాలేమీ చేయటంలేదు. ఫలితంగా తేయాకు నాణ్యత క్రమంగా పడిపోతూవుంది.

కార్మికులు తమ న్యాయమైన కోర్కెలను ముందుబెట్టి ఆందోళన చేసేట్లయితే, యాజమాన్యమంతా టీతోటలు మూసివేసే విధానంతో సిద్ధంగా వున్నారు. కార్మికులు చనిపోతున్నారు. బ్రతికున్న వారు అనారోగ్యానికి గురై బలహీనపడుతున్నారు. వారు ఆ టీతోటలలోనే జీవించాలి; అక్కడే మరణించాలి. వారంతా బానిసలుగా చూడబడుతున్నారు.

ప్రస్తుతం వారు సంఘటితపడటానికి ప్రయత్నిస్తున్నారు. అధికారంలో వున్నవారికి దగ్గర సంబంధాలున్న యూనియన్ నాయకులున్న చోట కార్మికులు తమ సర్వంఒడ్డి పనిచేస్తున్నారు.

అయితే దోపిడీ పరిమితి దాటిపోయింది. భీతావహం చేసే పరిస్థితులన్నింటినీ ప్రక్కకునెట్టి కార్మికులు సంఘటితం కావటానికి ప్రయత్నం చేస్తున్నారు. వారు తమకోసం మాత్రమే కాదు పోరాటం చేయవలసింది; టీతోటల యజమానుల వెనుకనున్న పాలకుల మెడలు కూడా వంచాలి.

౦౦౦౦